# మన ఊరికి ఏం చేద్దాం!

## నగరంలో నివాసముంటున్న కృష్ణా జిల్లా అంగలూరు వాసుల సమాలోచన



హైదరాబాద్‌లో నివాసముంటూ కృష్ణా జిల్లా గుడివాడ తాలుకా అంగలూరి గ్రామాభివృద్ధికోసం ఆదివారం సమావేశమైన ఆ గ్రామ వాసులు

(ఆన్‌లైన్-సిటీబ్యూరో)

దేశం కాని దేశంలో స్థిరపడి, లక్షలు కోట్లు సంపాదించి తాము పుట్టి పెరిగిన ఊరి కోసం ఎన్ఆర్ఐలు నిధులు సమకూర్చడం నిన్నటి మాట. ఎప్పుడో నగరానికి వచ్చి, ఇక్కడే స్థిరపడి తాము పుట్టి పెరిగిన ఊరి కోసం ఏదైనా చేయాలనుకోవడం నేటి మాట. ఇందుకు అంగలూరు గ్రామస్తులే చక్కని స్ఫూర్తి. నగరంలో ఉంటున్న అంగలూరు వాసులంతా కలిసి గ్రామాభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యల గురించి ఆదివారం సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ వాసులతో సంఘాన్ని స్థాపించారు.

కృష్ణాజిల్లా గుడివాడ డివిజన్‌లోని అంగలూరు గ్రామంలో ఒకప్పటి జనాభా ఆరువేలు. ఉపాధి కోసం, చదువుల కోసం, వ్యాపారాల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లగా అక్కడ నేడు మిగిలిన వారు రెండువేల మందే. ఊరు వదిలి వచ్చి నగరంలో స్థిరపడిన వారు సుమారు వెయ్యిమంది వరకు ఉంటారని అంచనా. ఎప్పుడో నగరానికి వచ్చి ఇక్కడ స్థిర పడిన వీరంతా తమ ఊరికి, అక్కడ ఉంటున్న వారికి ఏదైనా చేయాలని సంకల్పించారు. ఇందుకు గాను అంగలూరుకు చెందిన త్రిపురనేని సత్యనారాయణ, టి.వెంకటేశ్వరరావు, టి.హనుమాన్ చౌదరి, ఎర్నేని సుధాకర్ బాబు, దుగ్గిరాల వీరభద్రరావు, ఎర్నేని జగన్మోహనరావు, కోగంటి శివరావు వంటి పెద్దలు పూనుకొని నగరంలో ఉంటున్న తమ ఊరి వారిని కూడగట్టారు. వారితో ఆదివారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి వ్యవహారాలను చూసేందుకు ఎర్నేని జగన్మోహనరావు అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

### ఉగాది నాటికి వృద్ధుల కేర్ సెంటర్...

ముఖ్యంగా ఊరిలో ఉంటున్న వృద్ధుల కోసం డే కేర్ సెంటర్ ను నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ కేర్ సెంటర్‌లో ఊరిలో ఉన్న వృద్ధులకు ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు ఏ ర్పాటు చేస్తారు. దీనికోసం నామమాత్రపు రుసుం వసూలు చేయా లని నిర్ణయించారు. అది కూడా ఇవ్వలేని వృద్ధులకు ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని భావించారు. దీనికి 50వేల రూపా యలు ప్రస్తుతం అవసరమవుతాయని ప్రకటించగా అప్పటి కప్పుడే అందరూ కలిసి 60వేల రూపాయలను అందజేశారు. అదే విధంగా లింగం వెంకటరత్నం అనే గ్రామస్తులు సుమారు నాలుగు లక్షల రూపాయల విలువజేసే భూమిని కేర్ సెంటర్ ఏర్పాటుకు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా హనుమాన్ చౌదరి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నగరంలో ఉంటున్న అంగలూరు వాసులందరూ నిరంతరం కృషి చేయాలని, పట్టణాల్లో ఉన్న వసతులు గ్రామంలో కల్పించడం ద్వారా వారికి అన్ని సౌకర్యాలను కల్పించాలని యోచించారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.



నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న అంగలూరు గ్రామానికి చెందిన త్రిపురనేని వెంకటేశ్వరరావు, పక్కన టి.హనుమాన్ చౌదరి, కోగంటి శివరావు తదితరులు